క్లుప్తంగా

పార్టీ పటిష్టతకు కృషి చేయాలి

• ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు



ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడును సత్కరిస్తున్న కుమిలి ప్రజాప్రతినిధులు

పూసపాటిరేగ: పార్టీ పటిష్టతకు శక్తి వంచనలేకుండా కృషి చేయాలని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ పూసపాటిరేగ మండల యువజన విభాగం అధ్యక్షుడిగా ఎన్నికైన పడాల శ్రీధర్ మండలంలోని మోపాడలో ఎమ్మెల్యే స్వగృహంలో బడ్డుకొండను శుక్రవారం కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి. అప్పలనాయుడు, ప్రజాప్రతినిధులు గుజ్జు సురేష్‌రెడ్డి, గాబు సూరప్పన్నరెడ్డి, రమణ, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుడికి ట్యాబ్ అందజేత



దివ్యాంగ విద్యార్థికి లెనోవా ట్యాబ్‌ను అందజేస్తున్న ఎంఈఓ చంద్రమౌళి

భోగాపురం: మండలంలోని ముంజేరు జిల్లా పరిషత్ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న దివ్యాంగ విద్యార్థి బమ్మిడి వెంకటేష్‌కు లెనోవా ట్యాబ్‌ను ఎంఈఓ బి. చంద్రమౌళి శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ, విద్యార్థి ట్యాబ్‌ను సక్రమంగా వినియోగించుకుని అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సహిత విద్య ఉపాధ్యాయుడు డీవీ రమణరాజు, హెచ్‌ఎం బి. రమణమూర్తి, ఉపాధ్యాయులు, విద్యార్థి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దాసరి తిరుపతినాయుడుకు సత్కారం



దాసరి తిరుపతినాయుడు మాస్టారును సత్కరిస్తున్న సంస్థ ప్రతినిధులు (ఫైల్)

విజయనగరం టౌన్: సుమధుర నాట్యమండలి, ఆంధ్రా – తెలంగాణా రాష్ట్ర రంగస్థల కళాకారుల సాంస్కృతిక సమ్మేళనం ఆధ్వర్యంలో నెల్లూరు టౌన్ హాల్‌లో ఇటీవల నిర్వహించిన కార్యక్రమంలో జిల్లాకు చెందిన ప్రముఖ కళాకారుడు దాసరి తిరుపతినాయుడు సత్కరించారు. ఈ సందర్భంగా తిరుపతినాయుడు శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ, అక్కడి ఎంపీ డాక్టర్ మస్తాన్‌రావు యాదవ్, విజయనగరానికి చెందిన షేక్ బాషా, తదితరులు చేతుల మీదుగా సన్మానం జరిగిందన్నారు. ఈ సందర్భంగా దాసరిని స్థానిక కళాకారులు అభినందించారు.

సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ నాయకుడు నారాయణరావు

నెల్లిమర్ల: కేబుల్ ఆపరేటర్ల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఏపీ కేబుల్ ఆపరేటర్ల సంఘ ప్రతినిధులు ఎ. నారాయణరావు, బి. స్వామినాయుడు కోరారు. పట్టణంలోని పూడమ్మతల్లి వనం గుడి ప్రాంగణంలో నెల్లిమర్ల, గుర్ల, డెంకాడ, పూసపాటిరేగ, భోగాపురం, గంట్యాడ, గజపతినగరం మండలాలకు చెందిన కేబుల్ ఆపరేటర్లు శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కోవిడ్ వంటి విపత్కర పరిస్థితుల్లో సైతం ప్రజలకు సమాచారం అందించడంలో ఆపరేటర్లు చురుకైన పాత్ర పోషించారన్నారు. కోవిడ్ తర్వాత ఆపరేటర్ల పరిస్థితి దయనీయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆపరేటర్లను ఆదుకోవాలని కోరారు. సమావేశంలో సంఘ నాయకులు రాము, సురేష్, జగన్నాథం, లక్ష్మణరావు, రామదాసు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీటీసీ ఉదారత



కలెక్టర్ నాగలక్ష్మి చేతులు మీదుగా విరాళం అందజేస్తున్న జెడ్పీటీసీ శ్రీనివాసరావు

చీపురుపల్లి: గరివిడి మండల జెడ్పీటీసీ వాకాడ శ్రీనివాసరావు తన ఉదారతను చాటుకున్నారు. నెలిమర్లలో నిర్మిస్తున్న రామకృష్ణ ప్రార్థన మందిరం నిర్మాణానికి రూ.లక్ష విరాళం అందజేశారు. స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశం అనంతరం జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి చేతులు మీదుగా ఈ మొత్తాన్ని రామకృష్ణ మందిర నిర్వాహకులు జగన్నాథరాజుకు అందజేశారు. జెడ్పీటీసీగా తనకు ప్రభుత్వం ఇచ్చిన గౌరవ వేతనం రూ.72 వేలుకు మరో రూ.28 వేలు జోడించి మొత్తం లక్ష రూపాయలను రామకృష్ణ ప్రార్థన మందిరానికి విరాళంగా అందజేశారు.

క్రీడాస్ఫూర్తిని పెంపొందించడమే లక్ష్యం

• విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ శ్రీరాములనాయుడు
• ఉత్సాహంగా సాగుతున్న ఆడుదాం ఆంధ్రా పోటీలు



దెంకాడ: అక్కివరంలో క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ వాసుదేవరావు, వైఎస్సార్‌సీపీ యువజ నాయకుడు బడ్డుకొండ ప్రదీప్, తదితరులు



విజయనగరం: 14వ డివిజన్‌లో వాలీబాల్ పోటీలు ప్రారంభిస్తున్న కమిషనర్ రెడ్డి శ్రీరాములనాయుడు

విజయనగరం: యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడమే ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం లక్ష్యమని విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ ఆర్. శ్రీరాములనాయుడు, ఫ్లోర్ లీడర్ ఎస్‌వీవీ రాజేష్ అన్నారు. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా నగరంలోని 14వ డివిజన్ 17వ సచివాలయం పరిధిలో శుక్రవారం ఆనందోత్సాహాల నడుమ క్రీడా పోటీలు జరిగాయి. 21 సచివాలయాలకు సంబంధించి బ్యాడ్మింటన్, వాలీబాల్ క్రీడాంశాల్లో 34 మ్యాచ్‌లు నిర్వహించగా.. పోటీల్లో యువకులు తమ క్రీడా ప్రతిభను చాటారు. ఆయా క్రీడలను ముందుగా కమిషనర్ శ్రీరాములనాయుడు, ఫ్లోర్ లీడర్ ఎస్‌వీవీ రాజేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ శ్రీరాములనాయుడు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ ఎస్‌వీవీ రాజేష్ మాట్లాడుతూ, కార్యక్రమంలో భాగంగా వాలీబాల్, క్రికెట్, బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో వంటి పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డివిజన్ వైఎస్సార్‌సీపీ నాయకులు, మహిళలు, సచివాలయ సిబ్బంది, పాల్గొన్నారు.

క్రీడాకారుల్లో స్ఫూర్తి..

పూసపాటిరేగ: క్రీడాకారులలో స్ఫూర్తి నింపడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ మహంతి కల్యాణి అన్నారు. మండలంలోని చల్లవానితోట, కనిమెల్ల, పతివాడ సచివాలయాలకు సంబంధించి ఆడుదాం ఆంధ్రా క్రీడలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడానికే ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి.అప్పలనాయుడు, జేసీఎస్ కన్వీనర్ మహంతి శ్రీనివాసరావు, మహంతి జనార్దనరావు, వైస్ ఎంపీపీలు అల్లాడ రమేష్, ఎస్. సత్యనారాయణరాజు, సర్పంచ్ పైడి రామ్, పిన్నింటి నారాయణరావు, పి. సత్యం, ఎంపీడీఓ ఎం.రాధిక, ఈఓపీఆర్‌డీ శ్రీనివాసరావు, ఎంఈఓలు రాజ్‌కుమార్, పాపినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

వెలుగులోకి ప్రతిభ ..

దెంకాడ: ఆడుదాం ఆంధ్రాతో క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభ వెలుగులోకి వస్తుందని ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, వైఎస్సార్‌సీపీ యువజన నాయకుడు బడ్డుకొండ ప్రదీప్ అన్నారు. మండలంలోని అక్కివరం, గుణుపూరుపేట గ్రామాల్లో క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం క్రీడలు, క్రీడాకారుల్ని ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో ఆడుదాం ఆంధ్రా పేరుతో గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు క్రీడా పోటీలు నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ స్వరూపారాణి, ఎంఈఓ వెంకటరమణ, వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్మునాయుడు, అక్కివరం, చొల్లంగిపేట, డి.కొల్లాం సర్పంచ్‌లు కంది కిరణ్‌కుమార్, కోరాడ కనకరాజు, అట్టాడ కృష్ణ, పోలిపల్లి సహకారం సంఘ అధ్యక్షుడు బాలి సత్యనారాయణ, రైతు సలహా సంఘ చైర్మన్ పతివాడ సత్యనారాయణ, ఏపీ మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ సీహెచ్ సంధ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు తొత్తడి శ్రీను, కృష్ణరాజు, బడుకొండ రామునాయుడు, సచివాలయ అధికారులు, ఉద్యోగులు, గ్రామ వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.



విజయనగరం రూరల్: కొండకరకాంలో వాలీబాల్ పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

ప్రతిభ వెలికితీసేందుకే..

విజయనగరం రూరల్: గ్రామీణ ప్రాంత యువకుల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాలు వెలికితీసేందుకు ఆడుదాం... ఆంధ్రా క్రీడా పోటీలు దోహదపడతాయని విజయనగరం ఎంపీపీ మామిడి అప్పలనాయుడు అన్నారు. విజయనగరం మండలంలోని 13 గ్రామ సచివాలయాల పరిధిలో క్రీడాపోటీలు హోరాహోరీగా జరిగాయి. ఈ సందర్భంగా మండలంలోని కొండకరకాం గ్రామంలో క్రీడా పోటీలను ఎంపీపీ మామిడి అప్పలనాయుడు ప్రారంభించారు. అలాగే దుప్పాడ, చెల్లూరు, రాకోడు, కోరుకొండ, ద్వారపూడి, తదితర గ్రామాల్లో నిర్వహించిన పోటీలను ఎంపీపీ తిలకించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కిలారి రాంబాబు, ఆదినారాయణ, మండల శాఖ అధికారులు, సచివాలయ సిబ్బంది, యువత, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



పూసపాటిరేగ: పతివాడలో క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ కల్యాణి, అప్పలనాయుడు, తదితరులు



విజయనగరం: రాజీవ్ క్రీడామైదానంలో వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు



విజయనగరం రూరల్:దుప్పాలో కబడ్డీ క్రీడలో తలపడుతున్న క్రీడాకారులు



విజయనగరం రూరల్: కొండకరకాంలో క్రీడాకారులతో కరచాలనం చేస్తున్న ఎంపీపీ అప్పలనాయుడు

పేదల జీవితాల్లో వెలుగులు

• డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి
• 34వ డివిజన్‌లో 'గడప గడపకు మన ప్రభుత్వం'



మహిళలతో మాట్లాడుతున్న నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి

విజయనగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేదల జీవితాల్లో వెలుగులు నింపారని విజయనగరం కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. నగరంలోని 34వ డివిజన్ తోటపాలెం, వైఎస్సార్ నగర్ ప్రాంతాల్లో శుక్రవారం సాయంత్రం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు వివరించడంతో పాటు నాలుగున్నరేళ్ల వైఎస్సార్‌సీపీ హయాంలో ఒక్కో కుటుంబానికి కలిగిన లబ్ధిని తెలియజేస్తూ బుక్‌లెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమెకు స్థానికులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, గతంలో ఎన్నడూ లేనంత అభివృద్ధి, సంక్షేమం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నేతృత్వంలో జరుగుతోందన్నారు. ప్రతి ఇంటికీ పథకాలు అందుతుండడంతో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయని చెప్పారు. గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం పూర్తయిన డివిజన్‌లకు 20 లక్షల రూపాయలు మంజూరు కావడంతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. సంక్షేమ పాలన కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో మరోసారి జగన్ మోహన్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బాలి ప్రతాప్, కృష్ణంరాజు, తదితరులు పాల్గొన్నారు.

నేడు చాకివలసలో 'గడప గడపకు..'

భోగాపురం: మండలంలోని చాకివలసలో శనివారం ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు హాజరుకావాలని ఆయన కోరారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదానం చేస్తున్న దాతలు

విజయనగరం ఫోర్ట్: రక్తదానం ప్రాణదానంతో సమానమని యువజన సర్వీసులశాఖ అధికారి రామ్‌గోపాల్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎస్‌కే డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేవలం మనుషులు మాత్రమే ఆపదలో ఉన్న మరో వ్యక్తికి రక్తదానం చేయగలరని చెప్పారు. యువత రక్తదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నీతి విజ్వాన్, రాధికారాణి , వీరభద్రయ్య, శ్రీరామమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

విజయవాడకు సైకిల్ యాత్ర



సైకిళ్లపై విజయవాడకు బయలుదేరిన భవానీ భక్తులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని అలుగోలు గ్రామం నుంచి ఇద్దరు భవానీ భక్తులు విజయవాడ కనకదుర్గమ్మ దర్శనానికి శుక్రవారం సైకిల్‌పై పయనమయ్యారు. మండల దీక్ష ముగిసిన నేపథ్యంలో అంబళ్ల అప్పలనాయుడు, కోరాడ గోవర్ధన్ అనే ఇద్దరు భక్తులు ఇరుముడి స్వీకరించి సైకిల్‌యాత్ర ప్రారంభించారు.

జగనన్నను మరోసారి ఆశీర్వదించండి



మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ, ఎంపీ బెల్లాన, ఎమ్మెల్సీ సురేష్‌బాబు

• ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

భోగాపురం: పార్టీలు, కుల,మతాలకతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు పిలుపునిచ్చారు. మండలంలోని అమటాం రావివలస సచివాలయ పరిధిలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు నాలుగున్నరేళ్ల కాలంలో ఒక్కో కుటుంబానికి కలిగిన లబ్ధిని తెలియజేస్తూ ముఖ్యమంత్రి సందేశంతో ఉన్న బుక్‌లెట్లను పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పేదల సంక్షేమం, అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చిత్తశుద్ధితో పని చేస్తున్నారన్నారు. ఇంకా ఏమైనా సమస్యలుంటే తెలియజేస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. సంక్షేమ పాలన కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని బలపరచాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు అందవరపు సూరిబాబు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఉప్పాడ శివారెడ్డి, ఉప్పాడ విజయభాస్కర్‌రెడ్డి, సుందర హరీష్, నడుపూరి సత్యనారాయణ, చనుమల్ల రమణ, గదల సన్యాసినాయుడు, వైకుంఠం, సత్యనారాయణ, తహసీల్దార్ చింత బంగార్రాజు, ఎంపీడీఓ నీలం అప్పలనాయుడు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలు మెరుగుపరచాలి

• జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం అర్బన్: విద్యా ప్రమాణాలను మెరుగుపరచడానికి వార్షిక క్యాలెండర్, డైరీలను రూపొందించుకున్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు వాటిని పక్కాగా అమలు చేయాలని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయ సంఘ జిల్లా కమిటీ రూపొందించిన క్యాలెండర్-2020, డైరీలను శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ, విద్యారంగంలో జిల్లాను నెంబర్ వన్‌గా తీర్చిదిద్దాలని సూచించారు. కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు ఎం.వేణుగోపాలరావు, టి.సన్యాసిరాజు, రాష్ట్ర బాధ్యులు రాధాకృష్ణ, శ్రీనివాసరావు, ఏవీ రమణ, కోశాధికారి సాయి చక్రధర్, జిల్లా బాధ్యులు పాల్గొన్నారు.

రూ. 56.19 లక్షలతో రోడ్లు, కాలువల నిర్మాణం

• మేయర్ వెంపడాపు విజయలక్ష్మి



7వ డివిజన్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తున్న నగర మేయర్ విజయలక్ష్మి, స్థానిక కార్పొరేటర్లు

విజయనగరం: నగరంలోని అన్ని ప్రాంతాల్లోను అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు మేయర్ వెంపడాపు విజయలక్ష్మి అన్నారు. కార్పొరేషన్ పరిధిలోని 7, 8, 19 డివిజన్‌లలో రూ.56.19 లక్షలతో నూతనంగా రోడ్లు, కాలువల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో స్థానిక కార్పొరేటర్లతో కలిసి శంకుస్థాపనలు చేసి పనులు ప్రారంభించారు. 7వ డివిజన్ దాసన్నపేటలో కాళీమాత ఆలయం వద్ద రహదారి నిర్మాణానికి, దక్షిణ గట్టు ప్రాంతంలో కాలువలకు, లంకాపట్నంలోని రహదారుల పనులకు శ్రీకారం చుట్టారు. అనంతరం నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి మాట్లాడుతూ, ప్రజల కోరిక మేరకు అన్ని ప్రాంతాలలో మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి సూచనలు, సలహాలతో నగర అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. నగరంలో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు పార్కులు, ప్రధాన జంక్షన్లను అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. ప్రత్యేకంగా రోజు విడిచి రోజు తాగునీరు సరఫరా చేయడంతో పాటు పేద ప్రజల ఆకలిని తీర్చేందుకు ఫుడ్ బ్యాంకులు ఏర్పాటు చేశామన్నారు. 7వ డివిజన్ కార్పొరేటర్ పొంతపల్లి మాలతి మాట్లాడుతూ, ఎన్నడూ లేనివిధంగా తమ డివిజన్ అన్ని రంగాలలో అభివృద్ధి చెందిందన్నారు. వాటర్ ట్యాంకుల నిర్మాణం ద్వారా తాగునీటి సమస్య తీరిందని చెప్పారు. కార్యక్రమాలలో వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జ్‌లు కోలగట్ల కృష్ణారావు, రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి మండల డైరెక్టర్ ఎస్.బంగారునాయుడు, స్థానిక నాయకులు పొట్నూరు శ్రీనివాసరావు, పొంతపల్లి గోపి, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

• మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శ్రీరాములునాయుడు



మధ్యాహ్న భోజనాన్ని రుచి చూస్తున్న కమిషనర్ రెడ్డి శ్రీరాములనాయుడు

విజయనగరం: నగరంలోని 14వ డివిజన్‌లో గల స్వామి వివేకానంద ప్రాథమిక పాఠశాలను విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ రెడ్డి శ్రీరాములనాయుడు గురువారం సందర్శించారు. పాఠశాల ప్రాంగణమంతా కలియతిరిగి అక్కడ జరుగుతున్న విద్యాబోధన , సదుపాయాలను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. కొద్దిసేపు పిల్లలతో కమిషనర్ ముచ్చటించారు. ఆంగ్ల మాధ్యమంలో చిన్నారులు మాట్లాడుతుంటే చూసి మురిసిపోయారు. పిల్లలకి అందుతున్న మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలను ప్రైవేటుకు దీటుగా నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఫ్లోర్‌లీడర్ ఎస్‌వీవీ రాజేష్ , తదితరులు పాల్గొన్నారు.

కొత్త విషయాలు నేర్చుకోవాలి

• సెంచూరియన్ వీసీ ప్రొఫెసర్ మహంతి



సర్టిఫికెట్లు అందుకున్న తెలంగాణ విద్యార్థులతో సెంచూరియన్ వీసీ మహంతి, సిబ్బంది

నెల్లిమర్ల రూరల్: విద్యార్థులు ఎప్పటికప్పుడు కొత్త విషయాలను నేర్చుకుంటూ తమ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని వైస్ చాన్స్‌లర్, ప్రొఫెసర్ ప్రశాంత్‌కుమార్ మహంతి పిలుపునిచ్చారు. మండలంలోని టెక్కలి సెంచూరియన్ వర్సిటీలో మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ విభాగంలో శిక్షణ పొందిన తెలంగాణ విద్యార్థులకు శుక్రవారం సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ, వృత్తి సంబంధమైన కొత్త విషయాలను ఎప్పటికప్పుడు నేర్చుకోవాలన్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలపై అవగాహన పెంచుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీన్లు ప్రొఫెసర్ ఎంఎల్ఎన్ ఆచార్యులు, రమణారావు, సన్నిడి యోల్, మురళి, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల వినూత్న నిరసన



ఉరితాళ్లతో నిరసన తెలియజేస్తున్న మున్సిపల్ కార్మికులు

నెల్లిమర్ల: మున్సిపల్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికులు చేపడుతున్న నిరసన శుక్రవారానికి నాలుగో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా కార్మికులు మెడకు ఉరితాళ్లు బిగించుకుని నిరసన తెలియజేశారు. అనంతరం రామారావు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలన్నారు.. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు టి. బాబూరావు, బి. హరిబాబు, జె. శ్రీను, బి. రాము, టి. లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.